విద్యార్థులతో కలెక్టర్, విద్యాశాఖ అధికారులు

ఫలించిన కలెక్టర్ కృషి

- టెన్త్ ఫెయిలైన వారిపై ప్రత్యేక శ్రద్ధ
- ఉత్తీర్ణత సాధించేలా ప్రోత్సాహం
- 95 మందిలో 72 మంది పాస్
- విద్యార్థులను అభినందించిన కలెక్టర్ పమేలా సత్పతి

కమాన్‌చౌరస్తా, మే 1: వారంతా పదో తరగతి పరీక్షలు రాశారు.. రెండు, మూడు సబ్జెక్టుల్లో ఫెయిలయ్యారు.. ఆ తర్వాత తిరిగి పరీక్ష రాయాలనే ఆలోచన వారికి రాలేదు.. పరీక్ష ఫీజు చెల్లించలేదు.. ఏదో ఓ పని చేసుకుందామనే భావనతో ఉన్నారు. పిల్లలు పరీక్ష రాసేందుకు ఫీజు చెల్లించి, వారిని ఉన్నత చదువులు చదివిద్దామనే ఆలోచన కూడా వారి తల్లిదండ్రులకు రాలేదు. అలా రెండు, మూడేళ్లు గడిచాయి. వారిపై గత అసెంబ్లీ ఎన్నికల ముందు బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ పమేలా సత్పతి దృష్టి పడింది. కనీసం పదో తరగతి పాసైనా ఏదో ఓ చిరుద్యోగం సంపాదించి, ఉపాధి పొందుతారనే ఆలోచన కలెక్టర్‌కు వచ్చింది. వెంటనే విద్యార్థులను కన్విన్స్ చేసి పరీక్షలు రాయించి, పాస్ చేయించాలనే సంకల్పం తీసుకున్నారు. ఈ మేరకు వారి తల్లిదండ్రులతో ప్రత్యేకంగా సమావేశమై, విద్యార్థులు పరీక్షలు రాసేలా ఒప్పించారు. వివరాలు తెలుసుకుని పరీక్ష ఫీజు చెల్లించాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. వెంటనే రంగంలోకి దిగిన యంత్రాంగం జిల్లాలో ఫెయిలైన 124 మంది వివరాలు సేకరించింది. వారందరూ పరీక్షలు రాసేలా ఫీజులు చెల్లించారు. ఫెయిలైన సబ్జెక్టుల్లో ప్రత్యేకంగా ఉపాధ్యాయులతో పాఠాలు చెప్పించారు. వారు ఆయా సబ్జెక్టుల్లో పట్టు సాధించేలా ప్రత్యేక దృష్టి సారించారు. వార్షిక పరీక్షకు అన్ని విధాలా వారిని సిద్ధం చేశారు. 124 మందిలో 95 మంది విద్యార్థులు కరీంనగర్‌లోని పురాతన ఉన్నత పాఠశాల, హుజూరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరీక్షలు రాశారు. ఇందులో 72 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. వీరిలో 40 మంది బాలురు, 32 మంది బాలికలు ఉన్నారు. హాజరైన వారిలో 75.78 శాతం ఉత్తీర్ణత సాధించడంతో కలెక్టర్ కృషి ఫలించినట్లైంది. కలెక్టర్ ఇచ్చిన ప్రోత్సాహం, తమపై చూపిన ప్రత్యేక శ్రద్ధతో పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణులమయ్యామని విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను కలిసి తమ సంతోషాన్ని పంచుకున్నారు. మీ స్ఫూర్తితో తామంతా ఉన్నత చదువులు చదివి, అనుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు కృషి చేస్తామనే దీమాను కలెక్టర్ ఎదుట వ్యక్తం చేశారు.

కార్మికులకు అండగా బీఆర్ఎస్

మేడే వేడుకల్లో కార్మికులకు స్వీట్ తినిపిస్తున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్, పక్కన ఎమ్మెల్యే గంగుల కమలాకర్

- బలహీన వర్గాల సంక్షేమం కోసం పోరాటం
- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్
- మేడే వేడుకలకు హాజరు

కార్పొరేషన్, మే 1: కార్మికుల సంక్షేమం, హక్కుల కోసం పోరాటం చేసేది కేవలం బీఆర్ఎస్ మాత్రమేనని, అన్ని సమయాల్లో కార్మికులకు అండగా నిలిచామని ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ స్పష్టం చేశారు. బుధవారం కార్మిక దినోత్సవం సందర్భంగా నగరంలో బీఆర్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన మే డే వేడుకల్లో ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌తో కలిసి పాల్గొన్నారు. నగరంలోని నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట, బస్టాండ్ చౌరస్తాలో, ప్రొఫెసర్ జయశంకర్ చౌరస్తా, వ్యవసాయ మార్కెట్ కమిటీ వద్ద నిర్వహించిన వేడుకలకు హాజరై కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్మికులకు స్వీట్లు తినిపించారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ, కార్మికులు ఐక్యంగా ఉండి పోరాటం చేస్తే తప్పకుండా తమ హక్కులను సాధించుకోవచ్చన్నారు. బీఆర్ఎస్ హయాంలో కార్మికుల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేసిందని, ఆటో కార్మికులు, హమాలీలకు ఇతర వర్గాల వారిని అన్ని విధాలుగా ఆదుకునేందుకు అనేక కార్యక్రమాలు చేపట్టిందని గుర్తు చేశారు. కార్మికులకు తాము అన్ని సమయాల్లో అండగా నిలుస్తామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా జరుపుకొనే ఏకైక పండుగ కార్మిక దినోత్సవమన్నారు. బీఆర్ఎస్ కార్మికుల సంక్షేమం కోసం కట్టుబడి ఉందన్నారు. వారి సమస్యల పరిష్కారానికి అన్ని సమయాల్లో అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర సాధన ఉద్యమంలో కార్మికుల పాత్ర ఎంతో ముఖ్యమైందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు, కార్పొరేటర్లు కంసాల శ్రీనివాస్, నాయకులు ఎడ్ల అశోక్, గంట శ్రీనివాస్, బొమ్మిడి శ్రీనివాస్ రెడ్డి, ఆకుల మల్లేశం, ముత్యాల కృష్ణ, రమేశ్, సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

జిల్లావ్యాప్తంగా కార్మిక దినోత్సవం

తెలంగాణచౌక్/ విద్యానగర్/ హుజూరాబాద్ టౌన్/ జమ్మికుంట/ శంకరపట్నం/ చిగురుమామిడి/ వీణవంక/ మానకొండూర్/ కరీంనగర్ రూరల్/ ముకరంపుర, మే 1: జిల్లా వ్యాప్తంగా సీపీఎం, సీపీఐ పార్టీలతో పాటు అనుబంధ సంస్థలు ఏఐసీటీయూ, సీఐటీయూ, హమాలీ యూనియన్ ఆధ్వర్యంలో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. నగరంతోపాటు హుజూరాబాద్, జమ్మికుంట, శంకరపట్నం, చిగురుమామిడి, వీణవంక, మానకొండూర్ మండలాల్లో ఆయా కార్మిక సంఘ నాయకులు, తదితరులు ఎర్రజెండాను ఎగురవేశారు. అంతకుముందు ఆట, పాటలు, డప్పుచప్పుళ్లతో ర్యాలీలు తీశారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్మికులు పాల్గొన్నారు. కరీంనగర్ మండలంలోని చామనపల్లి, నగరంలోని రైల్వే గేటు వద్ద రైల్వే హమాలీ కార్మికులు నిర్వహించిన మేడే ఉత్సవాలకు ముఖ్య అతిథిగా సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి హాజరై మాట్లాడారు. పోరాడి సాధించుకున్న కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని మరోసారి అధికారంలోకి రాకుండా ఓడించాలని కార్మికులకు పిలుపునిచ్చారు.

రోడ్‌షోకు హాజరైన ప్రజలు

ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్

రోడ్‌షోకు నీరాజనం

కొత్తపల్లి, మే 1: ఎన్నికల ప్రచారంలో భాగంగా చింతకుంట గ్రామంలో బుధవారం రాత్రి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ నిర్వహించిన రోడ్ షోకు ప్రజలు నీరాజనం పలికారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌తో కలిసి వినోద్ కుమార్ హాజరు కాగా, చింతకుంటతోపాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. జై బీఆర్ఎస్.. అంటూ నినాదాలతో హోరెత్తించి పార్టీపై అభిమానాన్ని చాటుకున్నారు. రోడ్‌షోలో కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, ఎంపీపీ శ్రీలతామహేశ్, వైస్ ఎంపీపీ తిరుపతి నాయక్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, కో ఆప్షన్ సభ్యుడు షాబీర్ పాషా, జడ్పీ కో ఆప్షన్ సభ్యుడు ఎండీ జమీలుద్దీన్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ మధు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డికి ఓటమి భయం

మాట్లాడుతున్న రాష్ట్ర సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రవీందర్‌సింగ్

- అందుకే దేవుళ్లపై ఒట్లు వేస్తున్నడు
- సీఎం వ్యాఖ్యలపై ఈసీ సుమోటోగా కేసు నమోదు చేయాలి
- ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కయ్యాయి
- ఎవరేం చేసినా బీఆర్ఎస్‌కే మెజార్టీ సీట్లు వస్తయి
- రాష్ట్ర సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రవీందర్‌సింగ్

కార్పొరేషన్, మే 1: 'పార్లమెంట్ ఎన్నికల్లో సీఎం రేవంత్‌రెడ్డికి ఓటమి భయంపట్టుకున్నది. తక్కువ సీట్లు వస్తాయని ఆందోళనతో ఎలాగైనా గెలవాలని అది చేస్తాం.. ఇది చేస్తామని రోజుకో దేవుడిపై ఒట్టు వేస్తున్నడు. ప్రచార సభల్లో దేవుళ్లపై ప్రమాణాలు చేస్తూ ఓట్లు అడగడం ఎన్నికల నిబంధనలను అతిక్రమించడమే అవుతుంది. రేవంత్ వ్యాఖ్యలపై ఎన్నికల సంఘం సుమోటోగా కేసు నమోదు చేయాలి' అని రాష్ట్ర సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రవీందర్‌సింగ్ డిమాండ్ చేశారు. కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ హోటల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం అయిన తర్వాత తొలిసారి ఈ ప్రాంతానికి వచ్చిన రేవంత్‌రెడ్డి కరీంనగర్ జిల్లాకు గాడిద గుడ్డు తీసుకువచ్చాడా..? అని ప్రశ్నించారు. సీఎం హోదాలో గాడిద గుడ్డును ప్రదర్శించడం దేనికి నిదర్శనమని విమర్శించారు. ఎవరినీ అవమానించేందుకు సీఎం అలా ప్రవర్తిస్తున్నాడని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీజేపీలు రెండు ఒక్కటేనని విమర్శించారు. కరీంనగర్‌లో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా మూడు సార్లు పోటీ చేసిన జగపతిరావు కొడుక్కు ఇప్పుడు అదే పార్టీ టికెట్ ఇచ్చారని ఆరోపించారు. అలాగే మల్కాజ్‌గిరిలో బీజేపీకి లాభం చేసేందుకు అంతగా పట్టులేని అభ్యర్థిని కాంగ్రెస్ నిలబెట్టిందని విమర్శించారు. బీజేపీకి అనుకూలంగా ఉండేలా కాంగ్రెస్ కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నదని విమర్శించారు. ఇక్కడే కాదు రాష్ట్రంలోని పలు స్థానాల్లో కాంగ్రెస్ డమ్మీ అభ్యర్థులను నిలబెట్టి బీజేపీ అభ్యర్థులను గెలిపించేందుకు ప్రయత్నాలు చేస్తున్నదని ఆరోపించారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడించాలన్న కుట్రలతో బీజేపీ, కాంగ్రెస్‌లు కుయుక్తులు పన్నుతున్నాయని దుయ్యబట్టారు. వెలిచాల రాజేందర్‌రావు ఎప్పుడైనా కరీంనగర్‌లో కనిపించాడా..? అని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో రావడం డబ్బులు వెదజల్లడం అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఎవరెన్ని కుట్రలు చేసినా ఈ సారి తెలంగాణలో బీఆర్ఎస్ అత్యధిక సీట్లు గెలుచుకోవడం ఖాయమన్నారు. అందుకే రేవంత్‌రెడ్డి ఎక్కడికి పోయినా అక్కడి దేవుళ్లపై ఒట్టు వేసి ఓట్లు అడుగుతున్నారని, ఆయన వ్యాఖ్యలపై ఈసీ చర్యలు తీసుకోకపోతే తాము ఫిర్యాదు చేస్తామని చెప్పారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు గుంజపడుగు హరిప్రసాద్, తిరుపతి పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం

వీణవంక, మే 1: మామిడాలపల్లి గ్రామంలో బుధవారం జిల్లా యువజన క్రీడాశాఖ ఆధ్వర్యంలో వేసవి ఉచిత తైక్వాండో శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం శోభారాణి మాట్లాడుతూ, ఈ నెల 31 వరకు తైక్వాండో శిక్షణ శిబిరం కొనసాగుతుందని, ఆసక్తి గల వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కోచ్ బావు సంపత్, స్థానికులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రచార జోరు

- ఊరూరా ఇంటింటికీ వెళ్లి ఓటు అభ్యర్థిస్తున్న పార్టీ శ్రేణులు

కార్పొరేషన్/ మానకొండూర్/ గంగాధర/ సైదాపూర్/ కరీంనగర్ రూరల్, మే 1: పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సమయం దగ్గర పడుతున్న కొద్దీ బీఆర్ఎస్ ప్రచారం జోరందుకుంటున్నది. ఎన్నికల్లో భారీ మెజార్టీ లక్ష్యంగా ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, నాయకులు మరింత ఉత్సాహంతో ముందుకు సాగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం అన్ని డివిజన్లలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బోయినపల్లి వినోద్‌కుమార్ గతంలో ఎంపీగా కరీంనగర్‌లో చేపట్టిన అభివృద్ధిని గుర్తు చేయడంతో పాటు ప్రస్తుత ఎంపీ ఐదేండ్లలో ఏం చేయాలదన్న విషయాన్ని ప్రజలకు వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. 37వ డివిజన్‌లో డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణీహరిశంకర్ ప్రచారం చేపట్టి మాట్లాడారు. కరీంనగర్‌లో ఈ రోడ్ల అభివృద్ధి వినోద్‌కుమార్ స్మార్ట్‌సిటీ తీసుకురావడం వల్లే సాధ్యమైందని పేర్కొన్నారు. బండి సంజయ్ ఎంపీగా ఉండి నగరాభివృద్ధికి నయా పైసా తీసుకురాలేకపోయారని విమర్శించారు. వినోద్‌కుమార్‌ను గెలిపిస్తే నగరం మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఆయా ప్రచార కార్యక్రమాల్లో ఆయా డివిజన్ నాయకులు, శ్రేణులు పాల్గొన్నాయి. మానకొండూర్ మండల కేంద్రంలోని మూడో బూత్‌లో ఇంటింటికీ తిరుగుతూ గతంలో కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో బూత్ ఇన్‌చార్జి దండబోయిన శేఖర్, నాయకులు గుర్రం కిరణ్‌గౌడ్, పొగాకుల సాయిసుజిత్, పాశం భానుప్రసాద్, గొల్ల సంజయ్ తదితరులు పాల్గొన్నారు. గంగాధర మండలంలోని సర్వారెడ్డిపల్లి, కోట్లనర్సింహుపల్లి, వెంకంపల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించగా, ఈ సందర్భంగా గంగాధర సింగిల్ విండో చైర్మన్ దూలం బాలగౌడ్ మాట్లాడుతూ, చొప్పదండికి సైనిక్ స్కూల్‌ను తీసుకువచ్చిన వినోద్ కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఇక్కడ నాయకులు కరబూజ తిరుపతిగౌడ్, మహేశుని ఈశ్వరయ్య, ముక్కెర మల్లేశం, వేముల అంజి, వడ్లూరి ఆదిమల్లు, రేగుల తిరుపతి, ఇరుగురాల రవి, మోడుగు నల్లగొండయ్య, చిలుముల సుధాకర్, దుబ్బాసి రఘు తదితరులు పాల్గొన్నారు. మధురానగర్ చౌరస్తాలో వినోద్‌కుమార్‌కు మద్దతుగా మైనార్టీ సంఘం నాయకులు గడపగడపకూ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. మైనార్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ అక్బర్ హుస్సేన్, మాజీ సర్పంచ్ ఎండీ నజీర్, దుదేకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ రఫీ, బీఆర్ఎస్ మైనార్టీ సెల్ మండలాధ్యక్షుడు అబ్బాస్, నాయకులు సలీం, జలీల్, హమీద్, చాంద్ పాషా తదితరులు పాల్గొన్నారు. సైదాపూర్ మండలం ఎక్లాస్‌పూర్ గ్రామంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి చెల్మల్ల రాజేశ్వర్ రెడ్డి, మాజీ సర్పంచ్ చిక్కుల సంపత్, నాయకులు తిరుపతి, రాజు, స్వామి తదితరులు ప్రచారం చేశారు. కరీంనగర్ మండలం దుర్శేడ్ గ్రామంలో మాజీ ఉపసర్పంచ్ సుంకిశాల సంపత్‌రావు ఆధ్వర్యంలో ప్రచారం ముమ్మరంగా సాగింది. చామనపల్లి గ్రామంలో నిర్వహించిన ప్రచారంలో నాయకులు రాజ్‌కమల్, ఎస్ తిరుపతి, బోగ తిరుపతి, శ్రీనివాస్, మహేశ్ పాల్గొన్నారు.

37వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణీహరిశంకర్


గంగాధర: మధురానగర్‌లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్న మైనారిటీ నాయకులు

వేసవిలోనూ వినియోగదారులకు నిరంతర విద్యుత్ సరఫరా

జమ్మికుంట, మే 1: వేసవిలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా వినియోగదారులకు నిరంతరంగా విద్యుత్ సరఫరా చేయాలని ఎస్ఈ వీ గంగాధర్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన జమ్మికుంటకు వచ్చారు. ఫ్యూజ్ ఆఫ్ కాల్‌లో జరిగిన మేడే వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం డీఈ లక్ష్మారెడ్డి, ఏడీ రాజేందర్, ఏఈ సురేశ్వరాచారి, సబ్ ఇంజినీర్లతో కలిసి పట్టణంలోని మోత్కులగూడెం, హుజూరాబాద్ మేన్‌రోడ్డు, నాయిని చెరువు ఏరియాలో హెచ్‌టీ, ఎల్‌టీ లైన్లను పరిశీలించారు. కోరపల్లి గ్రామ పరిధిలోని నూతన విద్యుత్ 33/11కేవీ ఉప కేంద్రం స్థలం పరిశీలించారు. తర్వాత ఎస్ఈ మాట్లాడుతూ.. జిల్లాలో గతేడాది కంటే ఈ సారి ప్రతిరోజూ మూడు మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం పెరిగిందని తెలిపారు. జమ్మికుంటలో విద్యుత్ ఇబ్బందులను తగ్గించిన అధికారులు, సిబ్బందిని అభినందించారు. ఇక్కడ సబ్ ఇంజినీర్లతో పాటు సిబ్బంది ఉన్నారు.

విద్యుత్ భద్రతా వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

ముకరంపుర, మే 1: ఎన్పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో బుధవారం ఎస్ఈ గంగాధర్ విద్యుత్ భద్రతా వారోత్సవాల పోస్టర్, కరపత్రాలు, బుక్ లెట్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఈలు విజయేందర్ రెడ్డి, రాజం, తిరుపతి, ఎస్ఏవో రాజేశం, పీవో బీ చంద్రయ్య, లావణ్య, హబీబా, సురేశ్ కుమార్, శ్రీహరి ,మునీందర్, చంద్రశేఖర్, పండరి, విష్ణు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

సైదాపూర్, మే 1: వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ సారబుడ్ల ప్రభాకర్‌రెడ్డి అధికారులను కోరారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో యాదగిరి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. అంతకుముందు ఎంపీపీ తన జన్మదినం సందర్భంగా 26గ్రామాలకు చెందిన జీపీ కార్మికులకు డ్రెస్‌లను వితరణ చేశారు.

603 గ్రాముల గంజాయి పట్టివేత

రాంనగర్, మే 1: కరీంనగర్ రూరల్ మండలం ఫకీర్ పేట, చెర్లబూత్కూర్ గ్రామాల్లో జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ కే నాగేశ్వరరావు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి 603 గ్రాముల గంజాయి పట్టుకున్నారు. ఫకీర్ పేటకు చెందిన అడపా వంశీ, వేగురుపల్లికి చెందిన తప్పేట నితీశ్ కుమార్, కశ్మీర్ గడ్డకు చెందిన ఎండీ ఉమర్ అలియాస్ నోమన్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ముగ్గురు నిందితుల నుంచి 603 గ్రాముల ఎండు గంజాయితో పాటు డియో హోండా మోటార్ సైకిల్, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. చెర్లభుత్కూర్ గ్రామంలో గంజాయి సేవిస్తూ పట్టుబడ్డ ఐదుగురిని బైండోవర్ చేశారు. ఈ దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ మోసిన్, ఈసీలు కుమార్ యాదవ్, ఖాసింబి, కమలాకర్, వర్మ, జీవన్, ట్రైనీ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను చిత్తుగా ఓడిస్తాం: ఎమ్మార్పీఎస్

గంగాధర, మే 1: పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగలకు కనీసం ఒక్క సీటు కేటాయించని అధికార కాంగ్రెస్ పార్టీని చిత్తుగా ఓడిస్తామని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జెంకి అనిల్ స్పష్టం చేశారు. బుధవారం గంగాధరలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ఎన్నికల్లో మాదిగలకు టికెట్లు కేటాయించని కాంగ్రెస్ పార్టీ వైఖరికి నిరసనగా ఈ నెల 4న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇక్కడ నాయకులు రాజయ్య, శంకర్, రాజన్న, అంజయ్య, శ్రీనివాస్, రవి, మల్లేశం, చిరంజీవి తదితరులున్నారు.

ఎన్నికల ఏర్పాట్లు పూర్తి చేయాలి: ఎస్‌సీఈవో

కలెక్టరేట్, మే 1: లోక్‌సభ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. బుధవారం రాత్రి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈనెల 3 నుంచి ప్రారంభమయ్యే హోమ్ ఓటింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి మాట్లాడుతూ, ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టినట్లు వెల్లడించారు. అంతకుముందు కలెక్టరేట్ సమీపంలోని ఈవీఎంల గోదాంలో చేపట్టిన బ్యాలెట్ యూనిట్ల తనిఖీని ఆమె పర్యవేక్షించారు. ఆయా కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, శిక్షణ కలెక్టర్ అజయ్ యాదవ్, డీఆర్‌వో పవన్‌కుమార్, జడ్పీసీఈవో శ్రీనివాస్, ఈవీఎంల నోడల్ అధికారి కిరణ్‌ప్రకాశ్, పరిశ్రమల శాఖ జీఎం నవీన్‌కుమార్, డీఐవో శివరాములు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ శ్రీవాణి, ఇతర అధికారులు, రాజకీయపార్టీల నాయకులు పాల్గొన్నారు.

పోస్టల్ ఓటింగ్ సెంటర్ ఏర్పాట్ల పరిశీలన

నగరంలోని జ్యోతినగర్ సెయింట్ అల్ఫోన్స్ పాఠశాలలో పోస్టల్ ఓటింగ్ సెంటర్ ఏర్పాట్లను బుధవారం జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి పరిశీలించారు. ఈనెల 3 నుంచి 8లోగా అర్హులైన ఉద్యోగులంతా పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో శ్రీనివాస్, ఆర్డీవో కె.మహేశ్వర్, పరిశ్రమల శాఖ జీఎం నవీన్‌కుమార్, కరీంనగర్ రూరల్, అర్బన్ తహసీల్దార్లు నవీన్‌కుమార్, రమేశ్ పాల్గొన్నారు.

'పది' ఫలితాల్లో అల్ఫోర్స్ విద్యార్థుల సత్తా

రామడుగు(చొప్పదండి), మే 1: రామడుగు మండలం గోపాలరావుపేట అల్ఫోర్స్ పాఠశాల విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో అద్భుత ప్రతిభ చూపారు. బొమ్మెన జాహ్నవి, కళ్లెం జాహ్నవి, గండ్ర అరవింద్, చాడ స్రావ్య నా రెడ్డి, వర్షిత, కుర్ర శ్రీమన్య, జూపాక సిరి చందన, మెరుగు స్నిగ్ధ ఎనిమిది మంది 10 జీపీఏ సాధించారని, మరో ఎనిమిది మంది విద్యార్థులు 9.8 జీపీఏ సాధించడమే కాకుండా పాఠశాల విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు, విద్యార్థిని విద్యార్థులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

10 జీపీఏ సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి

వినోద్ కుమార్‌తోనే అభివృద్ధి

ముల్కనూరులో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సతీశ్ కుమార్

చిగురుమామిడి, మే 1: కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్‌తోనే సాధ్యమని, ఆయనను ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని హుస్నాబాద్ బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్ కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం ముల్కనూరు గ్రామంలో మండల స్థాయి బూత్ కమిటీల సమావేశానికి ఆయన హాజరై దిశానిర్దేశం చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మామిడి అంజయ్య, జిల్లా నాయకులు కొత్త శ్రీనివాస్ రెడ్డి, సాంబారి కొమురయ్య, పెనుకుల తిరుపతి, జంగ వెంకటరమణారెడ్డి, రామోజు కృష్ణమాచారి, అన్ని గ్రామాల అధ్యక్షులు, మండల నాయకులు, బూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'ఎస్ఆర్ ప్రైమ్' విద్యార్థుల ప్రభంజనం

10 జీపీఏ సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ఎస్ఆర్ విద్యా సంస్థల చైర్మన్ వరదారెడ్డి,

గంగాధర, మే 1: గంగాధర మండలంలోని ఎస్ఆర్ ప్రైమ్ పాఠశాల విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో ప్రభంజనం సృష్టించారు. పాఠశాల విద్యార్థులు నీల్‌కుమార్, పవన్‌కుమార్‌రెడ్డి, శ్రీలక్ష్మి, స్ఫూర్తి 10 జీపీఏ, అలాగే యశ్వంత్‌రెడ్డి, నందిని, శశివర్ధన్, కేతనశ్రీ, శివమని, హర్షవర్ధన్ 9.8 జీపీఏ సాధించారు. కాగా, ప్రతిభ చూపిన విద్యార్థులను విద్యాసంస్థల చైర్మన్ వరదారెడ్డి, డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, జోనల్ ఇన్‌చార్జులు తిరుపతి, శశిధర్, అకాడమిక్ డీన్ రవీందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు అభినందించారు.

ట్రినిటి పూర్వ విద్యార్థికి ఘన సన్మానం

సాయికిరణ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కళాశాల యాజమాన్యం, అధ్యాపక బృందం

కమాన్‌చౌరస్తా, మే 1 : ట్రినిటి కళాశాల పూర్వ విద్యార్థి నందాల సాయికిరణ్‌ను కళాశాల యాజమాన్యం బుధవారం ఘనంగా సన్మానించింది. 2012-14 బ్యాచ్‌కు చెందిన సాయికిరణ్ ఇటీవల ప్రకటించిన సివిల్స్ ఫలితాల్లో జాతీయస్థాయిలో 27వ ర్యాంకు సాధించాడు. నిరుపేద కుటుంబానికి చెందిన ఆయనకు రెండేళ్ల పాటు ఉచిత రెసిడెన్షియల్ విద్యను కళాశాల యాజమాన్యం అందించినట్లు కళాశాల డీన్ రమణారెడ్డి తెలిపారు. తమ కళాశాల యాజమాన్యం ప్రోత్సాహంతో జాతీయ స్థాయి పోటీ పరీక్ష జీమెయిన్స్‌లో ర్యాంకు పొంది వరంగల్ నిట్‌లో సీటు సాధించినట్లు తెలిపారు. బిటెక్ చివరి సంవత్సరంలోనే క్యాంపస్ ప్లేస్‌మెంట్ పొంది ఉద్యోగం చేస్తూనే సివిల్స్‌కు సిద్ధమై, ఎలాంటి శిక్షణ లేకుండా రెండో ప్రయత్నంలో జాతీయ స్థాయి ర్యాంకు పొందినట్లు వెల్లడించారు. ఆయన సాధించిన విజయం కళాశాలలో చదివే విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా మార్చాలనే భావనతో సన్మానించినట్లు తెలిపారు. ట్రినిటి మరో పూర్వవిద్యార్థి రవితేజ శాస్త్రవేత్తగా 108 శాటిలైట్స్ లాంచింగ్‌లో పాల్గొన్నట్లు తెలిపారు. అలాగే కళాశాలలో చదివిన విద్యార్థినీలు ఆర్.వైష్ణవి, వంగల అమూల్య ఇండియన్ ఇంజినీరింగ్ సర్వీస్‌కు ఎంపికైనట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రినిటి విద్యాసంస్థల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, లాంగ్‌టర్మ్ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారార్ విద్యార్థుల ప్రతిభ

కమాన్‌చౌరస్తా, మే 1 : విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిజ్ఞాస విద్యార్థి అధ్యయన ప్రాజెక్టు రాష్ట్రస్థాయి పోటీల్లో ఎస్సారార్ ప్రభుత్వ కళాశాల విద్యార్థులు మూడో స్థానంలో నిలిచారు. హిందీ సహ ఆచార్యుడు డా.వి.వరప్రసాద్ పర్యవేక్షణలో మహ్మద్ ముజుతబా, మహ్మద్ అసిఫ్, షేక్ సర్జిల్, సయ్యద్ ఖాజా మొయినుద్దీన్, సర్దార్ మన్‌ప్రీత్‌సింగ్, తదితర విద్యార్థులు సోషల్ మీడియాలో 'హిందీ భాష ఒక అధ్యయనం' అంశంపై అధ్యయనం చేసి తృతీయ బహుమతి గెల్చుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. కె.రామకృష్ణ తెలిపారు. విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టి.రాజయ్య, స్టాఫ్ సెక్రటరీ డా. ఎ.శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీబీసీ సర్టిఫికెట్ల ప్రదానం

కమాన్‌చౌరస్తా, మే 1 : నగరంలోని ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్,సైన్స్ అటానమస్ కళాశాలలో బుధవారం బేసిక్ బ్యూటీషియన్ కోర్సు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో శాతవాహన వర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జయంతి పాల్గొని మాట్లాడుతూ, సౌందర్యావశ్యకతను పరిగణనలోకి తీసుకుని కోర్సులో నేర్చుకున్న అంశాలు సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.రామకృష్ణ, ఆంగ్ల విభాగాధిపతి ఉమామహేశ్వరి, రిసోర్స్‌పర్సన్ లీనా, కోర్సు కో కోఆర్డినేటర్ డా.మన్నె శోభారాణి, కళాశాల ఏవో కామరాజు, అధ్యాపకులు సోనియారెడ్డి, డా.ప్రమీల, జూబ్లీరెడ్డి కతో పాటు విద్యార్థినులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీతం: 16k to 18k, ఏజెంట్ కమీషన్ 6k. Ph: 9640258899, 9640468899
NT-311845-All

CHANGE OF NAME

★ I, MARRIPELLY NARAYANA S/O. MARRIPELLY YELLAIAH , R/O. 7-3-231, VIJAYAPURI , JAGITYAL, TS. HENCEFORTH SHALL BE KNOWN AS MARRIPELLI NARESH S/O. MARRIPELLI YELLAIAH.
NT-327812

★ I, PALAKURTHI VINITHA, R/O. 5-57/1, AILAPUR, KORUTLA , JAGITYAL, TS. I HAVE CHANGED AFTER MARRIAGE MY NAME AS KODIMYALA LATHIKA W/O. KODIMYALA HARI PRASAD.
NT-327812

★ I, BOGA SANTOSH KUMAR S/O. BHEEMARAJAM, R/O. 1-6-71/1/B, DWARAKA NAGAR, JAGITYAL, TS. HENCEFORTH SHALL BE KNOWN AS BOGA SANTHOSH KUMAR S/O. BOGA BHEEMARAJAM.
NT-327812

★ I, BOLISETI NARESH KUMAR S/O. BOLISETI PEDDA DAMMAIAH , R/O. 5-23, THATIPELLI, JAGITYAL, TELANGANA. I HAVE CHANGED MY NAME AS BOLISHETTI NARESH S/O. BOLISHETTI DHARMAIAH.
NT-327812

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 91827 77571
91827 77194